# గంగాపురం కిషన్ రెడ్డి

## *సికింద్రాబాద్ పార్లమెంటు పార్లమెంటు సభ్యుడు*

ప్రజలంతా అభిమానంగా 'కిషనన్న' అని పిలుచుకునే గంగాపురం కిషన్ రెడ్డి.. కఠినమైన పరిశ్రమ, అంకితభావంతో పనిచేస్తే ఏదైనా సాధించొచ్చు అనే మాటకు నిలువెత్తు నిదర్శనం. ఎలాంటి పరిస్థితుల్లోనైనా ప్రశాంతంగా పనిచేసుకోవడమే కిషన్ రెడ్డి బలం. 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం నుంచి ఆయన 17వ లోక్‌సభ సభ్యుడిగా ఎన్నికయ్యారు. అంతకుముందు మూడుసార్లు ఎమ్మెల్యేగా, బీజేపీ పక్షనేతగానూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో బాధ్యతలు నిర్వహించారు.

తెలంగాణలోని రంగారెడ్డి జిల్లాకు చెందిన కిషన్ రెడ్డి.. 1960లో మధ్యతరగతి రైతు కుటుంబంలో జన్మించారు. ఆయన తండ్రి దివంగత శ్రీ గంగాపురం స్వామిరెడ్డి, తల్లి దివంగత శ్రీమతి ఆండాళమ్మ. కిషన్ రెడ్డి.. కావ్య రెడ్డిని వివాహం చేసుకున్నారు. ఆమె గృహిణిగా ఉంటూనే.. కిషన్ రెడ్డి గారి రాజకీయ ప్రయాణంలో చేదోడువాదోడుగా ఉంటారు. కూతురు వైష్ణవి, కుమారుడు తన్మయ్ ఉన్నతవిద్యను అభ్యసిస్తున్నారు.

అవినీతి, ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాటం సాగించిన లోక్‌నాయక్ శ్రీ జయప్రకాశ్ నారాయణ గారి స్ఫూర్తితో బాల్యం నుంచే కిషన్ రెడ్డి నాయకత్వ లక్షణాలను పుణికిపుచ్చుకున్నారు.

జనతాపార్టీ యువమోర్చా నాయకుడిగా కిషన్ రెడ్డి రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. 1980లో బీజేపీ ఏర్పాటైనప్పటినుంచీ పార్టీలో కొనసాగుతున్నారు. బీజేపీలోనూ సాధారణ కార్యకర్తగా మొదలుపెట్టి.. ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ.. పార్టీకి సంబంధించి రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయిలో ఉన్నత బాధ్యతలను నిర్వర్తించారు.

పార్టీ పట్ల, పార్టీ విస్తరణ పట్ల చిత్తశుద్ధితో చేసిన పని కారణంగా.. 2002లో భారతీయ జనత యువమోర్చా (BJYM) జాతీయ అధ్యక్ష బాధ్యతలు చేపట్టారు.

2004లో బీజేపీ తరపున హిమాయత్‌నగర్ నియోజకవర్గం నుంచి మొదటిసారిగా గెలిచి అసెంబ్లీలో అడుగుపెట్టారు. విపక్ష పార్టీలన్నీ దారుణ పరాజయాన్ని చవిచూసిన సమయంలో.. తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచినా.. మొత్తం ప్రతిపక్షాన్ని ప్రతిబింబించేలా ప్రజాసమస్యలపై గళమెత్తారు. అసెంబ్లీ చర్చల్లో లోతైన విశ్లేషణ, పరిపూర్ణతతో కిషన్ రెడ్డి చేసిన ప్రసంగాలు రాజకీయాలకు, సిద్ధాంతాలకు అతీతంగా అందరి మన్ననలు అందుకున్నాయి.

మొత్తంగా మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన.. ఎమ్మెల్యేగా.. 'నిజాయితీయే నా ధ్యేయం, అభివృద్ధే నా మార్గం' అనే నినాదంతోనే ఆయన ముందుకెళ్లారు. 'నేషన్ ఫస్ట్' (దేశమే ప్రథమం) స్ఫూర్తితో.. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ఆయన నిరంతరం శ్రమించారు.

ప్రజాప్రతినిధిగా ఎన్నో ప్రశంసలు అందుకున్న కిషన్ రెడ్డి గారి రాజకీయ జీవితంలో.. చిన్న పిల్లల గుండె ఆపరేషన్ల విషయంలో తీసుకున్న చొరవగురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. దీని కారణంగా.. వేలాది మంది చిన్నారులకు ఉచితంగా గుండె ఆపరేషన్లు జరిగాయి. పేదకుటుంబాలు తమ చిన్నారుల గుండె ఆపరేషన్లు చేసుకోలేని కారణంగా.. ప్రభుత్వమే చొరవతీసుకుని వారి ప్రాణాలు కాపాడాలని, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగతో కలిసి ఉద్యమంలో కిషన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ ఉద్యమానికి రాష్ట్ర ప్రభుత్వం తలొగ్గి ఉచితంగా చిన్నారులకు గుండె ఆపరేషన్లు చేసేందుకు అంగీకరించింది.

ఈ సమయంలోనే పౌర సమాజం, వివిధ సంస్థలు ముందుకొచ్చి.. ప్రభుత్వం తీసుకున్న చొరవకు మద్దతుగా నిలిచాయి. ఇలా చిన్నారులకు ఉచిత గుండె ఆపరేషన్ల విషయంలో తీసుకున్న ప్రత్యేక చొరవ, పోషించిన పాత్ర కారణంగా..

యూనిసెఫ్.. 'చైల్డ్ ఫ్రెండ్లీ లెజిస్లేటర్' గౌరవాన్ని పొందారు. అనంతరం ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలోనూ.. కిషన్ రెడ్డి కీలకపాత్ర పోషించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజల్లో చైతన్యాన్ని రగిలించేందుకు.. 25 రోజుల పాటు కృష్ణానది నుంచి గోదావరి వరకు 'తెలంగాణ పోరుయాత్ర'లో భాగంగా.. 333 సమావేశాల్లో ప్రసంగించారు.

తెలంగాణ హోంగార్డ్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడిగా.. హోంగార్డుల పురోగతికోసం జరిగిన ఉద్యమాలను ముందుండి నడిపించారు. పనికితగ్గ వేతనం, వారికి గౌరవాన్ని అందించేందుకు, వారి జీవితాలను మెరుగుపరిచేందుకు ఎంతో కృషిచేశారు.

బీజేవైఎం జాతీయాధ్యక్షుడిగా ఉన్న సమయంలో.. ప్రపంచవ్యాప్తంగా ఉగ్రవాద నిర్మూలన కోసం చేస్తున్న రాజకీయేతర సంస్థ.. వరల్డ్ యూత్ కౌన్సిల్ అగేనెస్ట్ టెర్రరిజం (WYCAT)ను స్థాపించారు. ఈ సంస్థ ఆధ్వర్యంలో ఢిల్లీలో ఓ అంతర్జాతీయ సదస్సును కూడా ఏర్పాటుచేశారు. ఇందులో 54 దేశాలకు చెందిన 193 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

సరిహద్దు గ్రామాల ప్రజలకు భరోసాను కల్పించడంతోపాటుగా.. ఆ గ్రామాలపై ప్రభుత్వం ప్రత్యేకమైన దృష్టి సారించి, అక్కడ వసతులు ఏర్పాటుచేయాలన్న లక్ష్యంతో 'సీమా సురక్షా జాగరణ్ యాత్ర'ను కూడా కిషన్ రెడ్డి నిర్వహించారు. తద్వారా అక్కడి ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడటంతోపాటుగా.. సరిహద్దు భద్రతకు కూడా బాటలు పడాలన్నది ఈ కార్యక్రమ ఉద్దేశం. 8 రాష్ట్రాల్లో 4 దేశాల (పాకిస్తాన్, బంగ్లాదేశ్, చైనా, నేపాల్ దేశాల) సరిహద్దుల గుండా.. 1200 కిలోమీటర్ల మేర 45 రోజుల పాటు ఈ యాత్రను చేపట్టారు.

***<u>రాజకీయ ప్రారంభ జీవితం:</u>***

కిషన్ రెడ్డిలోని నాయకత్వ లక్షణాలకు.. జాతీయవాది, సామాజిక సంస్కరణ నేత లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణతోపాటు పలువురు RSS నాయకులు ఓ దశ,

దిశను అందించారు. RSS సేవా కార్యక్రమాల ప్రభావం కిషన్ రెడ్డి జీవితంలో చాలా స్పష్టంగా కనబడుతుంది. RSS నేర్పిన క్రమశిక్షణ, జాతీయవాదం పట్ల ఆకర్షణగా.. కిషన్ రెడ్డి రాజకీయ ప్రస్థానం సాగింది. ఆయన జీవితంపై.. స్వామి వివేకానందుడి ప్రభావం చాలా ఎక్కువగా ఉంటుంది. ఐక్యత, జాతీయత, క్రమశిక్షణ, అందరినీ కలుపుకుని ముందుకెళ్లడం, వ్యక్తిగత పరిపూర్ణతకు మద్దతుగా నిలవడం వంటి వివేకానందుడి బోధనల ప్రభావం కిషన్ రెడ్డి జీవితంలో కనిపిస్తుంది.

చిన్నతనంలోనే జనతాపార్టీ అనంతరం బీజేపీ ద్వారా కిషన్ రెడ్డి రాజకీయాల్లోకి వచ్చారు. దీని కారణంగా రాష్ట్రంలో, దేశంలో.. పార్టీ పురోగతిని చాలా దగ్గర్నుంచి చూశారు. అందుకే పార్టీ ఆలోచనలను అమలు చేసే విషయంలో ఆయన అంకితభావం ప్రతి చోటా స్పష్టంగా కనబడుతుంది.

*<u>కీలకాంశాలు:</u>*

1. 2019లో సికింద్రాబాద్ పార్లమెంటు సభ్యుడు.

2. సంయుక్త ఆంధ్రప్రదేశ్, తెలంగాణ అసెంబ్లీల్లో బీజేపీ పక్ష నాయకుడు.

3. 2004 నుంచి 2018 వరకు హిమాయత్ నగర్, అంబర్‌పేట అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి 3సార్లు ఎమ్మెల్యే.

4. వరల్డ్ యూత్ కౌన్సిల్ అగేనెస్ట్ టెర్రరిజం (WYCAT) అంతర్జాతీయ చైర్మన్

5. అమెరికన్ కౌన్సిల్ ఆఫ్ యంగ్ పొలిటికల్ లీడర్స్ (ACYPL) భారత విభాగమైన ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ పొలిటికల్ లీడర్‌కు జాతీయ కార్యదర్శి.

6. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ హోంగార్డుల సంక్షేమ సంఘం చైర్మన్

7. తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ చైర్మన్

**రాజకీయ జీవితంలో కీలక ఘట్టాలు:**

- 1977లో జనతాపార్టీ యువమోర్చా నాయకుడిగా రాజకీయ ప్రస్థానం ప్రారంభం
- 1980లో బీజేపీ ఆవిర్భాం నుంచి పార్టీలో పూర్తిస్థాయి బాధ్యతలు
- 1980-81లో బీజేవైఎం రంగారెడ్డి జిల్లా కమిటీ కన్వీనర్
- 1982-83లో బీజేవైఎం రాష్ట్ర కోశాధికారి,
- 1983-84లో బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి
- 1986 నుంచి 1990 వరకు ఐదేళ్లపాటు బీజేవైఎం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు
- 1990 నుంచి 1992 వరకు బీజేవైఎం జాతీయ కార్యదర్శి, దక్షిణభారత ఇంచార్జ్
- 1992 నుంచి 1994 వరకు బీజేవైఎం జాతీయ ఉపాధ్యక్షుడు
- 1994 నుంచి 2001 వరకు బీజేవైఎం జాతీయ ప్రధాన కార్యదర్శి (వరుసగా మూడు పర్యాయాలు)
- 2001 జూలై నుంచి 2022 ఆగస్టు వరకు.. బీజేపీ రాష్ట్ర కోశాధికారి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, బీజేపీ రాష్ట్ర కార్యాలయ ఇంచార్జ్
- 2002 సెప్టెంబర్ నుంచి జూన్ 2004 వరకు, బీజేవైఎం జాతీయాధ్యక్షుడు
- 2004 నుంచి 2005 వరకు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పార్టీ ప్రధానకార్యదర్శి, రాష్ట్ర అధికార ప్రతినిధి.
- 2004 నుంచి 2009 వరకు హిమాయత్‌నగర్ ఎమ్మెల్యే.
- 2009 నుంచి 2014 వరకు అంబర్‌పేట ఎమ్మెల్యే.
- 2010 నుంచి 2014 వరకు రెండు పర్యాయాలు బీజేపీ ఆంధ్రప్రదేశ్ (సంయుక్త) రాష్ట్ర అధ్యక్షుడు
- 2014 మార్చ్ నుంచి 2016 ఏప్రిల్ వరకు తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు
- 2014 నుంచి 2018 వరకు రెండోసారి అంబర్‌పేట నుంచి ఎమ్మెల్యే.
- 2016 నుంచి 2018 వరకు బీజేపీ తెలంగాణ శాసనసభ పక్షనాయకుడు

- **2019లో సికింద్రాబాద్ పార్లమెంటు సభ్యుడు**
- **2019 మే నుంచి 2021 జూలై వరకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి**
- **2021 జూలై నుంచి  కేంద్ర సాంస్కృతిక, పర్యాటక, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి శాఖ మంత్రి**
- **2023 జూలై నుంచి నాలుగోసారి బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు**

***ఇతర కీలకమైన విజయాలు***

- **శ్రీ అటల్ బిహారీ వాజ్‌పేయి గారు ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో.. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు నేషనల్ యూత్ పాలసీ రూపకల్పనలో కీలకపాత్ర**
- **భారతదేశానికి ప్రాతినిధ్యం వహిస్తూ.. వివిధ దేశాల్లో జరిగిన అంతర్జాతీయ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అందులో కొన్ని.**
  - **అమెరికా ప్రభుత్వ సంస్థ అయిన అమెరికన్ కౌన్సిల్ ఫర్ యంగ్ పొలిటికల్ లీడర్స్ ఆహ్వానం మేరకు.. ప్రస్తుత ప్రధానమంత్రి నరేంద్రమోదీ గారితో కలిసి 1994లో అమెరికాలో పర్యటన. ఈ సందర్భంగా అమెరికా రాజకీయ వ్యవస్థపై సునిశిత అధ్యయనం.**
  - **బీజేవైఎం ప్రతినిధిగా ఇజ్రాయిల్ లో పర్యటన. ద్వైపాక్షిక, వాణిజ్య సంబంధాల బలోపేతంపై భారత బృందానికి నాయకత్వం.**
  - **వాషింగ్టన్ డీసీలో జరిగిన 'వరల్డ్ విజన్-2020' సదస్సుకు హాజరు.**
  - **2001లో బీజేవైఎం జాతీయ అధ్యక్ష హోదాలో.. చైనా ప్రభుత్వ సంస్థ అయిన 'చైనా యూత్ ఫెడరేషన్' ఆహ్వానం మేరకు చైనాలో పర్యటన.**
  - **1994లో యూకే, ఫ్రాన్స్, కేనడా, నేపాల్ దేశాల్లో పర్యటించి.. ఆయా దేశాల యూత్ పాలసీల అధ్యయనం.**

- 1994లో నాటి ప్రధాని శ్రీ పీవీ నరసింహారావు గారి చైర్మన్‌షిప్‌లో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన నేషనల్ యూత్ ప్రోగ్రామ్స్ లో కమిటీ సభ్యుడు.
- కేంద్ర ప్రభుత్వ శతాబ్ది వేడుకల ఏర్పాటుకోసం ఏర్పాటుచేసిన 'వందేమాతరం' కార్యక్రమ నేషనల్ స్టీరింగ్ కమిటీ సభ్యుడు.
- మొరాకో, మలేషియా, బల్గేరియా, సింగపూర్, ఈజిప్ట్, బ్యాంకాక్, హాంకాంగ్, ఫ్రాన్స్, యూకే వంటి దేశాల్లో ఉగ్రవాద వ్యతిరేక సదస్సులకు హాజరు.
- 2019లో ఆస్ట్రేలియా ప్రభుత్వం మెల్‌బోర్న్‌లో నిర్వహించిన 'నో మనీ ఫర్ టెర్రర్' మంత్రివర్గ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా సదస్సుకు హాజరు.
- 2023 జూలైలో న్యూయార్క్‌లోని ఐక్యరాజ్యసమితి కేంద్ర కార్యాలయంలో.. ఐక్యరాజ్యసమితి ప్రపంచ పర్యాటక సంస్థ ఆధ్వర్యంలో జరిగిన 'హైలెవల్ పొలిటికల్ ఫోరం' వేదికగా ప్రధానోపన్యాసం.

*__అవార్డులు, గౌరవాలు__*

- ఐక్యరాజ్యసమితి ద్వారా.. బెస్ట్ చైల్డ్ ఫ్రెండ్లీ లెజిస్లేటర్ (2004-2009) (ఆంధ్రప్రదేశ్) అవార్డు.
- అమెరికాలోని మేరీలాండ్ ఇండియా బిజినెస్ టేబుల్ ద్వారా 2009 సంవత్సరానికి గానూ 'ఔట్ స్టాండింగ్ యూత్ లీడర్‌షిప్ అవార్డు'.
- బల్గేరియా రాజధాని సోఫియాలో జరిగినకార్యక్రమంలో ప్రపంచశాంతికి చేసిన కృషికి గానూ బల్గేరియన్ కమాండోల ద్వారా మెడల్ ప్రధానం.